



రాజ్‌భవన్ గ్లాస్‌హౌస్‌లో గవర్నర్, సీఎంతో హైకోర్టు న్యాయమూర్తి

హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ శ్రీసుధ ప్రమాణం

బెంగళూరు, జూన్11(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తిగా పెరుగు శ్రీసుధ ప్రమాణస్వీకారం చేశారు. బుధవారం రాజ్‌భవన్ గ్లాస్‌హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. సీఎం సిద్దరామయ్య, హైకోర్టు ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి వీ కామేశ్వరరావు, మంత్రి కేజే జార్జ్, చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

డీసీఎంతో జేడీఎస్ ఎమ్మెల్యే భేటీ

● కాంగ్రెస్ గూటికి చేరుతారా..?

బెంగళూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం అనిపించే సంఘటన మంగళవారం ఢిల్లీలో చోటు చేసుకుంది. డీసీఎం డీకే శివకుమార్‌తో దేవదుర్గ జేడీఎస్ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ భేటీ అయ్యారు. ఇరువురూ పలు అంశాలపై చర్చించుకున్నారు. డీకే శివకుమార్‌పై జేడీఎస్ కీలక నేత కేంద్ర మంత్రి కుమారస్వామి తీవ్ర ఆగ్రహంలో ఉన్నారు. తరచూ వీరిద్దరిమధ్య మాటలయుద్ధం సాగుతోంది. ఇదే తరుణంలోనే ఎమ్మెల్యే, డీసీఎంతో భేటీ కావడం ఆసక్తికరంగా మారింది. ఆమె కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారా..? అనే చర్చ సాగుతోంది.



డీసీఎం డీకే శివకుమార్‌కు బొకే ఇస్తున్న ఎమ్మెల్యే కరెమ్మనాయక్

సీఎంతో టీటీడీ చైర్మన్ భేటీ



సీఎంను శాలువాతో సత్కరిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

బెంగళూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, ముఖ్యమంత్రి సిద్దరామయ్యను భేటీ అయ్యారు. బుధవారం సీఎం అధికారిక నివాసం కావేరిలో కలిశారు. సీఎంను సత్కరించి ప్రసాదాలు అందచేశారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో సౌకర్యాలపై చర్చలు సాగాయి. టీటీడీ బోర్డు సభ్యుడు నరేశ్‌కుమార్‌తోపాటు పలువురు ఉన్నారు.

స్పామ్‌కాల్స్ నుంచి రక్షణ

బెంగళూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మోసాలకు పాల్పడే ముఠాలు స్పామ్ కాల్స్ ద్వారా టార్గెట్‌లను ఎయిర్‌టెల్ ద్వారా నియంత్రిస్తున్నామని భారతి ఎయిర్‌టెల్ సీఈఓ రజనీశ్‌వర్మ వివరించారు. రాష్ట్ర సైబర్‌క్రైం, నార్కోటిక్ విభాగం డీజీపీ డాక్టర్ ప్రణబ్‌మహంతి ద్వారా బ్లాక్ ఎయిర్‌టెల్ ఫౌండ్ దిస్ సైట్ అనే పోస్టర్‌ను విడుదల చేయించారు. ఈ సందర్భంగా రజనీశ్‌వర్మ మాట్లాడుతూ వినియోగదారులకు మోసాలనుంచి రక్షించేందుకు ఏఐ టెక్నాలజీ అనుసంధానమైన నెట్‌వర్క్ ద్వారా సాంకేతిక విధానాలు అవలంబిస్తున్నామన్నారు. ఇటీవలికాలంలో ఆన్‌లైన్ మోసాలు తీవ్రమయ్యాయన్నారు. ప్రత్యేకించి బెంగళూరు, మంగళూరు, బెళగావి, చిక్కమగళూరు, హాసన్ నగరాలలో ఎక్కువకేసులు నమోదవుతున్నాయన్నారు. అందుకే వినియోగదారుల రక్షణకు ప్రజల్లో చైతన్యం తీసుకురాదలిచామన్నారు.

సాంఘిక సంక్షేమ అధికారి దారుణ హత్య

బెంగళూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విజయపుర జిల్లా ఇండి తాలూకా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రేణుక సాయిబణ్ణ కన్నోళి (32)ను చాకుతో పొడిచి హతమార్చారు. బుధవారం విధులకోసం వాహనంలో వెళ్తుండగా టిప్పు సుల్తాన్ సర్కిల్ వద్ద అడ్డువచ్చిన సంజు బనసోడ అనే వ్యక్తి చాకుతో పొడిచి పరారయ్యాడు. స్థానికులు ఆమెను విజయపుర జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్సలు ఫలించక ఆమె మృతి చెందారు. నిందితుడు సంజు బనసోళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్యకు వివాహేతర సంబంధం కారణమని తెలుస్తోంది.

ఎమ్మెల్యేలకు ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయి?

- ఎమ్మెల్యే గణేష్ ఇంట్లో రూ.కోట్ల ఆస్తుల దస్తావేజుల స్వాధీనం
- ప్రధాన అనుచరులు, పీఏల ఫోన్లు తనిఖీ
- ఈడీ దాడులతో బళ్లారిలో కలకలం

6

డీకే శివకుమార్‌కు కాలం.. కలిసొస్తోందా..?

- ఐదు నెలల దాకా విస్తరణకు అధిష్ఠానం బ్రేక్
- ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాకు చివరిక్షణంలో చెక్
- కులగణన రీ సర్వే... దేనికి సంకేతం?





బెంగళూరు, జూన్11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయ్యింది. సీఎం సిద్దరామయ్య పాలనలో ఎటువంటి మార్పులు రెండేళ్ల వ్యవధిలో చోటు చేసుకోలేదు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ గ్రాంట్లు బదిలీ చేసి హైదరాబాద్‌లోని సహకారబ్యాంకుల ద్వారా దుర్వినియోగానికి పాల్పడిన కేసులో నాగేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. అంతకుమించి కేబినెట్‌లో మార్పులు జరగలేదు. పలుమార్లు నాయకత్వ మార్పు, పదులసార్లు కేబినెట్ విస్తరణ అంశం చర్చకు వచ్చింది. పలుమార్లు సీఎం, డీసీఎంలు ఢిల్లీ వెళ్లి అధిష్ఠానం వద్ద చర్చలు జరిపారు. ఈ ఏడాది ప్రారంభం జనవరిలో పలువురు మంత్రులు, సామాజికవర్గాల వారిగా విందులు ఏర్పాటు చేయడం వివాదాలకు కారణమైంది. హుటాహుటిన ఏఐసీసీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ బెంగళూరుకు చేరుకుని లెజిస్లేచర్ సమావేశం జరిపారు. పలు హెచ్చరికలు చేస్తూనే రెండేళ్లు పూర్తి కాగానే విస్తరణ చేస్తామని సున్నితంగా మందలించారు. దీంతో నాలుగైదు నెలలు వేచివున్న ఆశావహులు ఇటీవల రెండేళ్ల సంబరం ముగియగానే మరోసారి ఢిల్లీ పెద్దలతో ప్రస్తావన తెచ్చారు. ఇదంతా కొత్త సంవత్సరం ప్రారంభం నుంచి జరిగిన ప్రక్రియ.

● ఐపీఎల్‌లో ఆర్సీబీ జట్టు విజయోత్సవాల వేళ జరిగిన తొక్కిసలాట రాష్ట్రప్రభుత్వానికి జాతీయస్థాయిలో చెడ్డపేరు వచ్చింది. దీంతో సీఎం, డీసీఎంలను హుటాహుటిన ఢిల్లీకి రప్పించారు. మంగళవారం సుదీర్ఘంగా చర్చలు జరిపారు. కేబినెట్ విస్తరణ మరో ఐదు నెలలు ఎవరూ ప్రస్తావించరాదని అల్టిమేటం జారీ చేసి పంపారు. అధిష్ఠానం ఐదు నెలలదాకా విస్తరణ గురించి మాట్లాడరాదనే ఆదేశాలు డీసీఎం డీకే శివకుమార్ వర్గీయులలో సంతోషం వ్యక్తం అవుతోంది. సరిగ్గా ఐదు నెలలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తవుతుంది. ఇప్పటివరకు అధిష్ఠానం నాయకత్వ మార్పు విషయంలో ఎక్కడా నోరు జారలేదు. 2023 ఎన్నికల విజయం తర్వాత సిద్దరామయ్య, డీకే శివకుమార్‌లు ముఖ్యమంత్రి పదవిపై పట్టుబట్టారు. ఏకంగా ఐదారు రోజులపాటు అధిష్ఠానం పెద్దలు కూడా సర్దుబాటు చేసే పరిస్థితి లేకుండా పోయింది. చివరకు సిద్దరామయ్యకు ముఖ్యమంత్రి పదవి ఖరారు చేశారు. అయితే డీకే శివకుమార్‌కు కేపీసీసీ అధ్యక్ష పదవిని యథావిధిగా కొనసాగిస్తూనే ఉపముఖ్యమంత్రి హోదాతోపాటు జలవనరులశాఖ, బెంగళూరు అభివృద్ధిశాఖను కేటాయించారు. డీకే శివకుమార్‌కు కేబినెట్‌లో ఎవరికీ లేనంత ప్రాధాన్యం ఇవ్వడం వెనుక మతలబు ఉందనే ఊహాగానాలు ఉన్నాయి. వీటన్నింటికీ దిశా నిర్దేశం చేసేలా అధిష్ఠానం వ్యవహరిస్తోంది. ఐదు నెలలదాకా మంత్రివర్గ విస్తరణ ఉండదని తేల్చిచెప్పడం పరోక్షంగా ఓ వర్గాన్ని సిద్ధం కావాలని సంకేతం ఇచ్చినట్టుగా ఉంది.

నాగేంద్రకు ఏడాది కిందటే హామీ... తాజాగా బీకే హరిప్రసాద్‌కు..

వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో 94 కోట్ల రూపాయల అవినీతిలో సిట్ నిర్దోషిగా తేల్చింది. అయితే ఇదే కేసును యూనియన్‌బ్యాంకు ముఖ్యుల సూచనతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తులో నాగేంద్ర అసలు సూత్రధారిగా చార్జ్‌షీట్ నమోదు చేసింది. అయినా సిట్ క్లీన్‌చిట్ ఇవ్వడంతో 2024 లోక్‌సభ ఎన్నికల వేళ నాగేంద్రకు మరోసారి మంత్రి పదవి ఇస్తానని సీఎం సిద్దరామయ్య బహిరంగ ప్రకటన చేశారు. అప్పటినుంచి నాగేంద్ర ఎప్పుడైనా అవకాశం రావచ్చునని ఎదురుచూస్తున్నారు. ఇక తాజాగా పార్టీ సీనియర్ నేత బీకే హరిప్రసాద్ ఇంటికి సీఎం సిద్దరామయ్య వెళ్లారు. తాజా రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఎమ్మెల్సీగా ఉన్న బీకే హరిప్రసాద్‌కు కేబినెట్‌లో చోటు ఉంటుందని ప్రచారం జరిగింది. కానీ సామాజిక సమీకరణల నేపథ్యంలో ఆయనకు బెర్త్ లభించలేదు. దాదాపు ఏడాదిపాటు రాష్ట్ర నాయకులపై ప్రత్యేకించి సీఎం సిద్దరామయ్యకు వ్యతిరేకంగా వ్యవహరించారు. ఇటీవలే కొంత సర్దుబాటుతో పార్టీలో క్రియాశీలకమయ్యారు. బీకే హరిప్రసాద్‌కు కేబినెట్‌లో చోటు ఉంటుందని ఇటీవల రెండు వారాలుగా జోరుగా ప్రచారం సాగుతోంది. వారం రోజులుగా కేబినెట్ నుంచి పదిమందిని పక్కనపెడతారనే చర్చ పార్టీలో సాగుతోంది. స్వయానా శరణబసప్ప దర్శనాపుర మా నేతలు ఢిల్లీకి వెళ్లారని అక్కడ కీలకమైన చర్చలు సాగవచ్చని, మంత్రులు కొందరిని తొలగించాలనే ప్రతిపాదన ఉందని, అందులో నాపేరు కూడా అంటూ... బహిరంగ ప్రకటన చేశారు. వీటన్నింటి ప్రకారం పదిమంది దాకా మంత్రులు ఒకటి రెండు రోజుల్లోనే పదవులకు దూరమవుతామని కూడా భావించారు. వారిలో ఆర్‌బీ తిమ్మాపుర, రహీంఖాన్, శివానందపాటిల్, కే వెంకటేశ్, శరణప్రకాశ్ పాటిల్, డీ సుధాకర్, భైరతి సురేశ్ తోపాటు మరో మూడు నాలుగుపేర్లు వినిపించాయి. కానీ ఐదు నెలలు విస్తరణ ఉండదని అధిష్ఠానం తేల్చడంతో మరింతకాలం మంత్రులుగా ఉంటారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాకు చివరి క్షణంలో చెక్

విధానపరిషత్‌లో ఖాళీగా ఉన్న నాలుగుస్థానాల కోసం ఇటీవల ముఖ్యమంత్రి పంపిన జాబితాకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ వేసింది. అందులో సీఎం సిద్దరామయ్యకు ఆప్తులైనవారే ముగ్గురు ఉన్నారు, మరొకరు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే వర్గీయుడిగా ముద్ర ఉంది. డీసీఎం డీకే శివకుమార్‌కు ఎమ్మెల్సీల జాబితాలో వెనుకడుగు అయ్యిందని ప్రచారం సాగింది. అయితే జాబితా రాజ్‌భవన్‌కు వెళ్లకుండానే అధిష్ఠానం మరోసారి చెక్ పెట్టింది. కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే పార్టీలో గ్రూపులు పనిచేశాయనేందుకు ఇదే కారణమైంది. రాజ్‌భవన్‌కు జాబితా పంపకముందే దినేశ్ అమీన్‌మట్టు, రమేశ్‌బాబులను ఎమ్మెల్సీలుగా గుర్తించరాదని, వారిపై పలు ఆరోపణలు చేస్తూ రాజ్‌భవన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. జాబితాకు బ్రేక్ పెట్టడంతో డీసీఎం డీకే శివకుమార్‌కు పలుకుడి పెరిగినట్టయ్యింది.

కులగణన రీ సర్వే... దేనికి సంకేతం?

కులగణన సర్వే విషయంలోనూ సీఎం సిద్దరామయ్యకు ముఖభంగం జరిగినట్టే. ఇటీవలే కేబినెట్‌లో స్వీకరించిన కులగణన నివేదికను అమలు చేస్తామని పదే పదే ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. కేబినెట్‌లో చర్చించి తీర్మానిస్తామని కులగణన నివేదికలో వెనుకడుగు లేదన్నారు. కానీ అధిష్ఠానం ఏకంగా పదేళ్లనాటి కులగణన నివేదిక అంటూ మంగళం పలికింది. వివిధ కులసంఘాలు అభ్యంతరం తెలిపాయని ఓ సందేశం ఇచ్చారు. కులసంఘాలు వ్యతిరేకించినా, స్వయంగా కేబినెట్‌లోని మంత్రులు డీకే శివకుమార్, మల్లికార్జున అడ్డుకుంటామన్నారు. అయినా ముఖ్యమంత్రి ముందడుగే అనేలా వ్యవహరించారు. కానీ అధిష్ఠానం ఒక్కసారిగా రీ సర్వేకు ఆదేశించడం ఏకంగా ఆయన సిఫారసులను పక్కన పెట్టినట్టే అయ్యింది. ఢిల్లీనుంచి వచ్చిన ముఖ్యమంత్రి బుధవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ కులగణన నివేదికకు రీ సర్వే అధిష్ఠానం నిర్ణయమని స్పష్టం చేశారు. ఈ పరిణామాలు సీఎం సిద్దరామయ్యకు ఢిల్లీలో అనుకూలంగా లేవని చెప్పేందుకు సంకేతాలు అయ్యాయి.

సమాజసేవకు అంకితమవ్వాలి

● విద్యార్థులకు గవర్నర్ పిలుపు

బెంగళూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సమాజసేవకు అంకితం కావాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. బెంగళూరు సిటీ యూనివర్సిటీ నాల్గో స్నాతకోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా చాన్స్‌లర్ హోదాలో హాజరైన గవర్నర్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ ఏడాది డిగ్రీ 32,486 మందికి, 7285మందికి పీజీ, 9మందికి పీహెచ్‌డీలు ప్రదానం చేశారు. ఎంఎస్సీ విద్యార్థిని అనూష 5 బంగారు పతకాలను సాధించారు. శేషాద్రిపురం కళాశాల విద్యార్థిని మనస్‌జైన్, విశ్వేశ్వరపుర కళాశాల విద్యార్థిని ఆర్ఎస్ సంజనా చెరో మూడు బంగారు పతకాలను సాధించారు. 56ఏళ్ల వయస్సులో ఫ్రెంచ్ సబ్జెక్టులో 2 పీజీలను ప్రియా బాలచంద్ర సాధించారు. వైస్‌చాన్స్‌లర్ కేఆర్ జలజ, రిజిస్ట్రార్ రమేశ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ ఏడాది గౌరవ డాక్టరేట్‌లను ఎవరికీ ప్రదానం చేయలేదు.



బంగారు పతకాలు పొందిన విద్యార్థులు



పట్టాలను ప్రదానం చేస్తున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్

యడియూరప్ప ఇంట

రిసెప్షన్‌కు ఈశ్వరప్ప



రిసెప్షన్‌లో పాల్గొన్న ఈశ్వరప్ప, కుమారుడు కాంతరాజ్‌ను పలకరిస్తున్న యడియూరప్ప


బెంగళూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): యడియూరప్ప మనవడు, ఎంపీ రాఘవేంద్ర కుమారుడు సుభాష్ రిసెప్షన్ వేడుకలకు మాజీ డీసీఎం ఈశ్వరప్ప హాజరయ్యారు. కుమారుడు కాంతరాజ్‌తో కలసి శివమొగ్గలో బుధవారం సుభాష్, శ్రావణ రిసెప్షన్ జరిగింది. రాజకీయ ద్వేషం వీడి ఈశ్వరప్ప వేడుకలకు రావడం యడియూరప్ప ఆత్మీయంగా పలకరించి కాసేపు మాట్లాడుకోవడం ప్రత్యేకత అనిపించింది. ఈశ్వరప్ప కుమారుడు కాంతరాజ్, యడియూరప్పకు పాదాభివందనం చేయగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర దగ్గరకు వచ్చి ఆత్మీయంగా పలకరించారు. విజయేంద్ర వెన్నుతట్టిన ఈశ్వరప్ప మంచి జరగాలని అభినందించారు. యడియూరప్ప స్వయంగా కండువా కప్పి సత్కరించారు. 2024 లోక్‌సభ ఎన్నికలలో టిక్కెట్ రానందుకు ఈశ్వరప్ప శివమొగ్గ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో యడియూరప్ప, ఈశ్వరప్పల మధ్య తీవ్రమైన వ్యతిరేకత సాగింది. కాగా రిసెప్షన్ వేడుకల ద్వారా మళ్లీ వారిద్దరూ ఒక్కటైనట్టు అయ్యింది.

నగరంలో వాన కష్టాలు

బెంగళూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నగరవ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం 2 గంటలనుంచి ప్రాంతాల వారీగా నగరంలో వర్షం కురిసింది. సాయంత్రం పాఠశాల వదిలేవేళ విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. వివిధ ప్రాంతాలకు వెళ్లదలిచిన ప్రయాణికులు సకాలంలో గమ్యానికి చేరేందుకు తంటాలు పడాల్సి వచ్చింది. పలు చోట్ల ప్రజలు తడుస్తూనే వెళ్లారు.



ఆర్‌టీ నగర్‌లో వర్షంలో ద్విచక్రవాహనదారుల ఇబ్బందులు



కంటోన్మెంట్ అండర్‌పాస్ వద్ద పాదచారుల ఇబ్బందులు



వర్షంలో వెళ్తున్న విద్యార్థినులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

హెచ్‌ఎం రెడ్డి (జయంతి)




దక్షిణాది సినీ పితామహగా పేరొందిన హనుమప్ప మునియప్ప రెడ్డి 1892 జూన్ 12న బెంగళూరులో జన్మించారు. తెలుగు సినీ రంగంలో శబ్దాన్ని ప్రవేశపెట్టి దర్శకత్వం వహించిన తొలి టాకీ (ఫుల్‌లెంగ్త్ మూవీ) 'భక్తప్రహ్లాద'కు ఆయనే రూపకర్త. 1931లో తెలుగు, తమిళ భాషలలో టాకీ 'భక్త కాళిదాస'కు దర్శకత్వం వహించారు. రాజనాల, కాంతారావు వంటి వారిని పరిచయం చేసిన ఘనత ఆయనదే. పోలీస్ కెరీర్‌ను వదిలి సినీ రంగంలోకి రావడంతో పరిశ్రమకే వెలుగుతెచ్చారు. 1960 జనవరి 14న కన్నుమూశారు.

పాల్ఘాట్ మణి అయ్యర్ (జయంతి)



మృదంగ విద్వాంసులు, 'పద్మ భూషణ్' గ్రహీత పాల్ఘాట్ మణి అయ్యర్ 1912 జూన్ 12న కేరళ రాష్ట్రం పాలక్కాడ్ ప్రాంతంలో జన్మించారు. పళని సుబ్రమణియమ్ పిళ్ళై, రామనాథపురం సీఎస్ మురుగ భూపతిలతో కలసి 'మృదంగ త్రయం'గా పేరొందారు. సంగీత కళానిధి, సంగీత నాటక అకాడమీ తదితర అవార్డులు అందుకున్నారు. మృదంగ వాదనలో గురుగా పిలవబడ్డారు. 1981 మే 30న కన్నుమూశారు.

వెలగా వెంకటప్పయ్య (జయంతి)




ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథాలయ ఉద్యమానికి సారథి అయిన వెలగా వెంకటప్పయ్య 1932 జూన్ 12న గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించారు. గ్రంథాలయ పితా మహుడు, మానవతావాది, పరి పాలనా దక్షుడు, పత్రికా సంపాదకుడు, సాహితీ వేత్తగా మన్ననలు పొందారు. బాల సాహిత్యం పరిశోధనలకు పీహెచ్‌డీ అందుకున్నారు. వందకు పైగా పుస్తకాలు, గ్రంథాలయ విజ్ఞానంకోసం సంబం ధించి రాసిన గ్రంథాలు అత్యంత ప్రామాణికమైనవి. వయోజన విద్య, సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమాలలో కీలకపాత్ర వహించారు. 2014 డిసెంబరు 29న కన్నుమూశారు.

పద్మిని (జయంతి)



పద్మిని 1932 జూన్ 12న కేరళ రాష్ట్రం త్రివేంద్రంలో జన్మించారు. నటి, భరతనాట్య నృత్యకారిణి. 30 ఏళ్లలో 250కుపైగా సినిమాలలో నటించారు. పద్మిని, తన సోదరీమణులు లలిత, రాగిణిలతో కలసి 'ట్రావెన్‌కోర్ సిస్టర్స్'గా పిలవబడ్డారు. 16వ యేటనే డ్యాన్సర్‌గా హిందీ సినిమాలో కెరీర్‌ను ప్రారంభించారు. 50, 60 దశకాలలో 'ఛార్మింగ్ బ్యూటీ క్వీన్'గా పేరొందారు. తమిళనాడులో 'నాట్య పెరోలి'గా పేరొందారు. కళైమామణి, ఫిల్మ్‌ఫేర్ తదితర అవార్డులు పొందారు. 2006 సెప్టెంబరు 24న కన్నుమూశారు.

డాక్టర్ ఈ శ్రీధరన్ (పుట్టినరోజు)



'మెట్రో మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేరొందిన డాక్టర్ ఎలత్తువాలాపిల్ శ్రీధరన్ 1932 జూన్ 12న కేరళ రాష్ట్రంలో జన్మించారు. సివిల్ ఇంజనీర్‌గా కొంకణ్ రైల్వే, ఢిల్లీ మెట్రోలతో రవాణా వ్యవస్థలో పెను మార్పులు సాధించారు. ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు 1992 నుంచి 2012వరకు మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగారు. ఐక్య రాజ్య సమితిలో రవాణాకు సంబంధించి ఉన్నతస్థాయి సలహాదారుల సమితిలో మూడేళ్లపాటు సభ్యుడిగా కొనసాగారు. పాంబన్ బ్రిడ్జ్‌ను 46రోజుల్లో పూర్తి చేసినందుకు 'రైల్వే మినిస్టర్స్' అవార్డు అందుకున్నారు. 'పద్మశ్రీ', పద్మ విభూషణ్ సహా పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు.

ముగ్గురు బాలుర అదృశ్యం

రాయచూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా కడగల్ గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు ఒకే రోజు అదృశ్యమైయ్యారు. గత నెల 6వ తేదీన సాయంత్రం బయటికి వెళ్లివస్తామని వెళ్లిన ముగ్గురు స్నేహితులు ఇప్పటివరకు తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. 6వ తేదీన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న లింగసుగూరు పోలీసులు బాలుర ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కొన్నాళ్ల పాటు చుట్టుపక్కల గ్రామాలు ఇతర బంధువుల వద్ద వాకబు చేసిన తల్లిదండ్రులు ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.

హంపిలో నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి



హంపిలోని రాతి రథం, స్మారకాలు

బళ్లారి సిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): హంపి ప్రపంచ వారసత్వ ప్రాంతంలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే కఠినచర్యలు తప్పవని హంపి ప్రపంచ వారసత్వ ప్రాంత నిర్వహణ అథారిటీ కమిషనర్ హెచ్చరించారు. హంపి యునెస్కోప్రపంచ వారసత్వ ప్రదేశం, ఈ ప్రాంతాన్ని కాపాడేందుకు నిబంధనలను అమలు చేసింది. దీని ప్రకారం అథారిటీ పరిమితుల్లో ఏదైనా నిర్మాణం, విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించే ముందు అథారిటీ నుంచి అనుమతి పొందడం తప్పనిసరి అన్నారు. అనుమతి లేకుండా నిర్వహించే ఏదైనా నిర్మాణ పనులు అనధికారికంగా పరిగణిస్తామని తెలిపారు. ఎటువంటి నోటీసు లేకుండా తొలగించేందుకు అన్ని అధికారులు ఉంటాయన్నారు. వాతావరణ చట్టం 2002, ఇతర చట్టాల ప్రకారం అనధికార కార్యక్రమాలు చేపట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాహిత్యంలో యువత రాణింపు హర్షణీయం

▸ డీవీజీ కగ్గ రచన ఇంటింటికీ చేరాలి: తహసీల్దార్ గీత



వివిధ రంగాల సాధకులకు ఆత్మీయ సన్మానం

ముళబాగిలు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ముళబాగిలు ప్రాంతం ధార్మిక, చారిత్రక ఇతిహాసాలతో సాహిత్యంలోనూ తన ప్రాధాన్యతను చాటుకుందని తహసీల్దార్ గీత అభిప్రాయపడ్డారు. పట్టణంలోని డీవీజీ పాఠశాలలో కన్నడ బెళగు వేదిక ఆధ్వర్యంలో డీవీ గుండప్ప 138వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులను బుధవారం ప్రదానం చేశారు. ఇదే సందర్భంగా వివిధరంగాల సాధకులను ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇటీవలి రోజుల్లో యువత సాహిత్య రంగంలోనూ గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. తనకు కన్నడ సాహిత్యంపై అభిరుచి ఉండడంతో రానున్నరోజుల్లో కన్నడ కార్యక్రమాల్లో పాల్గొంటానన్నారు. రాష్ట్రం, భాష, సాహిత్య కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని, అదే విధంగా యువత మరింత చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కన్నడ బెళగు వేదిక అధ్యక్షుడు అత్తికుంటె ఎస్ సుబ్రమణి మాట్లాడుతూ డీవీ గుండప్ప రచనలైన కగ్గలో ఆధ్యాత్మిక, సామాజిక, సాంస్కృతిక, సమాజం సహా బతుకు, జీవన ప్రయాణం, పుట్టుక, చావు వంటి ఎన్నో విషయాలు ఉన్నాయన్నారు. తద్వారా కగ్గను చదవడం, అధ్యయనం కేవలం విద్యార్థులకు పరిమితం కారాదని అందరి ఇళ్లల్లో ఉండాలని అభిప్రాయపడ్డారు. డీవీజీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సొణ్ణప్ప మాట్లాడుతూ ఇప్పటికే తమ పాఠశాలల్లో ప్రతి ఒక్క విద్యార్థి డీవీ గుండప్ప రచన కగ్గను నిరంతరం చదువుతున్నారన్నారు. ఇందుకు ఉపాధ్యాయులు ఎంతో అభ్యాసం చేస్తున్నారన్నారు. కన్నడ బెళగు వేదిక ఆధ్వర్యంలో కొన్ని పోటీలు నిర్వహించడం ద్వారా పిల్లల్లో మరింత సృజనశీలత పెంచేందుకు అనుకూలం కానుందన్నారు. వ్యాసరచన, చిత్రకళ, కగ్గ కంఠస్థం, గీతగాయనం, భరతనాట్యం సహా పలు రకాల పోటీలు నిర్వహించారన్నారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రం, విజేతలకు బహుమతులతో సత్కరించారు. రాష్ట్ర ఉత్తమ పురస్కార గ్రహీత రిటైర్డు టీచర్ సరోజమ్మ, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార విజేత ఎస్‌కే పద్మావతి, అంతర్జాతీయ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పురస్కారం పొందిన దళిత పోరాట నేత మెకానిక్ శ్రీనివాస్, గ్రామపంచాయతీ సభ్యుల మహా ఒక్కూట తాలూకా అధ్యక్షుడు పెత్తాండ్లహళ్ళి పీవీ శంకర్, విలేజ్ అకౌంటెంట్‌ల సంఘం అధ్యక్షుడు గిరీశ్, ఎస్‌డీఎంసీ సంఘం తాలూకా అధ్యక్షుడు హనుమనహళ్ళి నాగేశ్‌కుమార్‌లను గౌరవంగా సత్కరించారు. బీఈఓ కేఎన్ రామ చంద్రప్ప, కన్నడ బెళగు వేదిక గౌరవాధ్యక్షుడు అప్పికొంచేనహళ్ళి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు కేఆర్ శివరాజు, కరునాడసంఘం అధ్యక్షుడు ఈ శ్రీనివాసగౌడ, ఉపాధ్యాయులు శారద, భారతి, మంజుళ, భాగ్యశ్రీ, సల్మా, కవిత, ఎస్‌డీఎంసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడండి

▸ కరవే జిల్లా అధ్యక్షుడు ఎంఆర్ లోకేశ్

బాగేపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల హవా నుంచి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని, కన్నడ పాఠశాలల్లో ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని కరవే జిల్లాధ్యక్షుడు ఎంఆర్ లోకేశ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలో కరవే రాష్ట్ర అధ్యక్షుడు టీఏ నారాయణగౌడ 59వ పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, మొక్కలు పంపిణీ చేసి రిటైర్డు ఉద్యోగులను ఆత్మీయంగా సత్కరించారు. రాష్ట్రం, నేల, నీరు, భాషల మనుగడ కోసం నిరంతరంగా పోరాటాలు చేస్తున్న కరవేకు ప్రపంచంలోనే ఎక్కువశాఖలు ఉండడం గర్వకారణమని లోకేశ్ పేర్కొన్నారు. ఎంతోమంది కన్నడ పోరాట యువకులకు నారాయణగౌడ స్ఫూర్తిగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 1001 మొక్కలను పంపిణీ చేశారు. అంతకుముందు భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఈఓ ఎన్ వెంకటేశప్ప, ఆర్ హనుమంతరెడ్డి, కేవీ శ్రీనివాస్, ఈశ్వరప్ప, కేవీ ఆదినారాయణ, కీర్తిబసప్ప తదితరులు పాల్గొన్నారు.



మొక్కలతో విద్యార్థినులు



వివిధ రంగాల సాధకులకు సన్మానం

బీఐఈసీలో ఏసియా ల్యాబెక్స్ ప్రదర్శనలు

బెంగళూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బయోలజీ, ల్యాబరేటరీ పరిశోధనలు, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ విభాగాలకు సంబంధించిన పెన్నా ఎగ్జిబిషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏసియా ల్యాబెక్స్ ప్రదర్శనలు తుమకూరు రోడ్డులోని బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ (బీఐఈసీ)లో ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ప్రదర్శన లను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. మైక్రోల్యాబ్స్ లిమిటెడ్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ మనోజ్‌కుమార్‌సింగ్, రేసీ ఫార్మా సర్వీసెస్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రమేశ్ జగదీశన్, సిగ్మా ఆల్డ్రిచ్ టెక్నాలజీ సంస్థ డైరెక్టర్ నాగహనుమయ్యలు ప్రదర్శనలో ముఖ్యులుగా పాల్గొన్నారు. ఏసియా ల్యాబెక్స్ అధ్యక్షుడు జస్పాల్‌సింగ్ మాట్లాడుతూ సైన్స్‌రంగంలో ఈ ఏడాది ప్రదర్శనలతోపాటు రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. పరి శోధనలు ఆవిష్కరణల మధ్య ఉండే అంతరాన్ని తగ్గించడమే లక్ష్యంగా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. పరిశోధనలు ప్రగతిదశలోకి తీసుకురావాలని గుణాత్మకమైన నియంత్రణ, ఆధునికతకు అనుగుణంగా ల్యాబ్‌లలో రూపొందించే ప్రయోగాలను ప్రదర్శించేందుకు ఇదో వేదిక అన్నారు.



ప్రదర్శనను ప్రారంభిస్తున్న మనోజ్‌కుమార్ సింగ్ తదితరులు

వైభవంగా మునీశ్వరస్వామి జాతర




ఆలయానికి ఊరేగింపుగా వస్తున్న కళాబృందాలు

శిడ్లఘట్ట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పదేళ్లకోసారి నిర్వహించే జడల మునేశ్వరస్వామి జాతర వైభవంగా జరిగింది. తాలూకాలోని పోసగానదొడ్డి, నెరళెమరదహళ్ళి, ఎస్ గొల్లహళ్ళి, ఎస్ వెంకటాపుర గ్రామాల ఆరాధ్యదైవంగా మునియప్పనకట్టెగా పేరొందిన స్థలంలో జాతర ఘనంగా నిర్వహించారు. ఈసారి వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని రైతులకు కనీస ధర లభించాలని కోరుతూ పూజలు చేసినట్టు కాంగ్రెస్ యువనాయకుడు, ఎస్ దేవగానహళ్ళి గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు ఎం మంజునాథ్ తెలిపారు. నాలుగు గ్రామాల మహిళలు దీపాల హారతితో వీరగాసె, నాదస్వర, తమటె వాద్య బృందాలతో జడల మునేశ్వరస్వామి దేవాలయానికి చేరుకున్నారు. దేవగానహళ్ళి గ్రామ పంచాయతీ సభ్యుడు ఉప్పకుంతహళ్ళి అశ్వథ్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్లకోసారి నిర్వహించే జాతరలో స్వామికి పూజలు చేయడం ద్వారా కష్టాలు తొలగుతాయనే విశ్వాసం ఉందన్నారు. కులాలకు, పార్టీలకు అతీతంగా ప్రజలంతా పాల్గొనడం ద్వారా ధార్మిక సామరస్యానికి ప్రతీక సాధ్యమైందన్నారు. గ్రామాలలో ఎటుచూసినా జాతర సందడి నెలకొంది. పలురకాల తినుబండారాల దుకాణాలు వెలిశాయి. గ్రామాల ప్రముఖులు రాజు, కృష్ణప్ప, ప్రశాంత్, కెంపణ్ణ, మునికృష్ణప్ప, దొడ్డనరసింహప్ప, మంజునాథ్, మురళి, భైరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అణ్ణమ్మదేవి ఉత్సవం

విజయపుర, జూన్ 11(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణం జేసీ లే అవుట్‌లోని సిహిమునేశ్వరస్వామి ఆలయం వద్ద అణ్ణమ్మదేవి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించారు. అర్చకుడు దేవరాజు నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. మంగళవారం అమ్మవారికి పంచామృతాభిషేకం, నవగ్రహహోమం, అష్ట దిక్పాలక హోమం, పంచబ్రహ్మ హోమం, రుద్ర హోమం, దుర్గాహోమం, రుద్రలఘున్యాస హోమం, జయదిహోమం నిర్వహించిన అనంతరం మహామంగారతి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం రాత్రి పురవీధులలో సిహి మునేశ్వరస్వామి, పూజమ్మ దేవి, అణ్ణమ్మదేవి ఉత్సవమూర్తులను పురవీధులలో ఊరేగించారు.



పురవీధుల్లో అణ్ణమ్మదేవిని ఊరేగిస్తున్న భక్తులు

విత్తనాలు, ఎరువులు సిద్ధం

▸ చింతామణి తాలూకాలో 63 శాతం అధిక వర్షం

చింతామణి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): చింతామణి తాలూకాలో 2025 జనవరి నుంచి జూన్ 6వరకు 141.7 మిమీ వర్షం కురవాల్సి ఉండగా 63 శాతం అధికంగా అంటే 230.9 మిమీ వర్షపాతం నమోదైందని, వచ్చేవారం మరింత వర్షం కురిసే అవకాశం ఉందని విత్తనపనులకు సిద్ధం కావాలని వ్యవసాయశాఖ సహాయక డైరెక్టర్ అమరనారాయణరెడ్డి తెలిపారు. కంది, వేరుశనగలను వర్షం కురిసిన వెంటనే విత్తనాలు వేయడం సముచితమన్నారు. ఆలస్యమైతే దిగుబడి తక్కువగా ఉంటుందన్నారు. 2025-26 సంవత్సరానికి ఖరీఫ్‌కు తాలూకాలో ఏకదళ ధాన్యం రాగి 15090, మొక్కజొన్న 4880 హెక్టార్లు, ద్విదళ ధాన్యం కంది 860 హెక్టార్లు, ఉద్దులు 442 హెక్టార్లు, అనప 900, నూనెగింజలలో వేరుశనగ 4140 హెక్టార్ల లక్ష్యంగా ఉందన్నారు. ఇప్పటికే అవసరమైన విత్తనగింజలు అందుబాటులో ఉన్నాయన్నారు. రాగి 100 క్వింటాళ్లు, కంది 9.30 క్వింటాళ్లు, మొక్కజొన్న 30.35 క్వింటాళ్లు, అలసందలు ఒక క్వింటాలు, వేరుశనగ 200 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. అంతేకాక 732.7 టన్నుల యూరియా, 186.4 టన్నుల డీఏపీ, 1200 టన్నుల కాంప్లెక్స్ ఎరువులకేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా రైతులు పంటల బీమా పథకాన్ని నమోదు చేసుకోవాలన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: మంత్రి సవిత

పరిగి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టిసారించారని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొడికొండ శిర హైవే వద్ద సింగిరెడ్డిపల్లి క్రాస్ నుంచి బసవనపల్లి వరకు రూ.2.10కోట్లతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఆమె ప్రారంభించారు. అక్కడి నుంచి పరిగి సమీపంలోని హైవే నుంచి తిరుమలదేవరపల్లికి రూ.కోటితో బీటీ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో గ్రామీణప్రాంతాలు అభివృద్ధివైపు వెళుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో దోచుకోవడం, దాచుకోవడంతప్ప ప్రజలకు ఏమీచేయలేదన్నారు. వైసీపీ నాయకులు మహిళలపై ఏవిధంగా దుర్భాషలాడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. మహిళలను అవమానపరిస్తే భగవంతుడు జగన్‌రెడ్డిని శిక్షిస్తాడన్నారు. మహిళలంటే జగన్‌కు విలువలేదని, సొంత తల్లి, చెల్లిని, చిన్నాన్న కూతుర్ని ఏంచేశాడో ప్రజలకు తెలుసన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేయని అభివృద్ధిని ప్రభుత్వం యేడాదిలోనే చేసి చూపించిందని పేర్కొన్నారు. ఎక్కడి నుంచి వలస పక్షులు వచ్చాయో వారి సొంత నియోజకవర్గం వెళ్లి అడిగితే వారి చరిత్ర బయటపడుతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 70లక్షల మంది విద్యార్థులకు రూ.9వేల కోట్లను విద్యార్థుల తల్లుల ఖాతాలో జమచేయనున్నారన్నారు.



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి సవిత

అసత్య ఆరోపణలతో
ఉద్యోగం నుంచి తొలగించే కుట్ర

బెంగళూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): 30ఏళ్లుగా మణిపాల్ ఆసుపత్రిలో పనిచేస్తున్నామని ఇటీవలే మణిపాల్ ఆసుపత్రి లేబర్ అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యానని తనను తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని రాజగోపాల్, జాయింట్ సెక్రటరీ రవీంద్రబాబు ఆరోపించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. ఏప్రిల్ 18న మహిళా సహోద్యోగిని బలవంతంగా బండిలో తీసుకెళ్లానని ఆరోపిస్తున్నా అన్నారన్నారు. వాస్తవానికి ఆరోజు గుడ్‌ఫ్రైడే కావడంతో చర్చ్‌లో ఉన్నానన్నారు. కేసు నమోదుతో ముందస్తు బెయిల్ పొందానని, పోలీసుల విచారణలో వాస్తవాలు తెలిశాయన్నారు. ఉద్యోగం నుంచి తొలగించేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.

రూ.6.7 లక్షల నగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగలతో పోలీసులు

బంగారపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కామసముద్రం, బంగారపేట పోలీస్ స్టేషన్ పరిధిలలో చోటు చేసుకున్న జరిగిన చోరీ కేసులలో నిందితులను అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ.6.70లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఏప్రిల్ 4న పోలేనహళ్ళి గ్రామ నివాసి మునివెంకటప్ప తన ఇంట్లో చోరీ గురించి కామసముద్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ పాండురంగ మార్గదర్శకంలో సీఐ నారాయణస్వామి, ఎస్సై కిరణ్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బంగారపేట తాలూకా శివలింగ గ్రామానికి చెందిన చంద్రప్ప (48)ను అరెస్టు చేసి, కామసముద్రం, బంగారపేట పోలీస్ స్టేషన్‌లలో రెండు కేసులకు సంబంధించి రూ.6,70,000 విలువైన 69 గ్రాముల నగలను స్వాధీనం చేసుకుని నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై బీవీ కిరణ్‌కుమార్, ప్రత్యేక బృందం కార్యాచరణలో పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

చింతామణి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ముస్లింల పవిత్ర యాత్రాస్థలమైన మురగమల్లా గ్రామంలోని జంగ్లిపీర్ దర్గా సమీపాన గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను కెంచార్లహళ్ళి పోలీసులు అరెస్టు చేశారు. బెంగళూరు గ్రామీణ జిల్లా హొసకోటె తాలూకా పరదాపుర గ్రామానికి చెందిన గణేశ్, వాసీం ఖాన్‌లుగా గుర్తించారు. వీరినుంచి సుమారు రూ.80వేల విలువైన సుమారు ఒక కిలోగంజాయిని స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మురళీధర్ మార్గదర్శకంలో కెంచార్లహళ్ళి సీఐ జనార్ధన నేతృత్వంలో ఎస్సై శివకుమార్, సిబ్బంది కార్యాచరణ నిర్వహిం చారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

పొలాల్లోకి కలుషిత నీరు



కాలువ నీటిలోకి మురుగునీరు

బళ్లారి సిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వర్షకాలం ప్రారంభంలోనే తాలూకాలోని కమలాపురం సరస్సుకు గండి పడింది. రైతులు సంతోషంగా ఉన్నారని భావిస్తున్న సమయంలోనే కమలాపురం సరస్సు నుంచి కాలువ నీరు నగరంలోని మురుగునీటిలో కలిసి రైతుల పొలాల్లోకి ప్రవహిస్తున్నాయి. నగరంలోని మురుగునీరు షాది మహల్ సమీపంలో కాలువలోకి కలుస్తున్నాయి. కమలాపురం పోలీస్ స్టేషన్ సమీపంలోని మరోపెద్ద కాలువలో మురుగు నీరు ప్రవహిస్తున్నాయని, ఈ నీరు రైతుల పొలాలకు నీటిని సరఫరా చేసే కాలువలో కలుస్తున్నాయని మానవతా సహాయ సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ కెంగేరి అన్నారు. కమలాపురం చుట్టుపక్కల గ్రామాల నుంచి పనికివచ్చే వందలాది మంది వ్యవసాయ కార్మికులు కూడా సరస్సు కాలువ గుండా ప్రవహించే నీటిని తాగడానికి ఉపయోగిస్తారన్నారు. పట్టణం నుంచి కలుషితమైన నీరు ఈ నీటిలో కలిసిపోయాయన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

16 నుంచి ధర్తీ ఆబా ప్రచారంపై అవగాహన

విజయనగరం (హోస్పేట), జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 16వ తేదీ నుంచి ధర్తీ ఆబా ప్రచారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎంఎస్ దివాకర్ తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికీ ముఖ్యంగా వాటిని సద్వినియోగం చేసుకుని ప్రధాన స్రవంతిలోకి వచ్చే గిరిజన వర్గాలకు అందించడమే లక్ష్యమని డిప్యూటీ కమిషనర్ అన్నారు. బుధవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయ హాలులో ప్రయోజనాల కోసం ప్రాథమిక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1602.19	1580.90
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,308	4,024
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	185	8
నీటి నిల్వ (టీఎంసీలు)	24.44	4.92

హులిగమ్మదేవికి ప్రత్యేక పూజలు



కంప్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బళ్లారి రోడ్డులో వాల్మీకి నగర్‌లో బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా హులిగమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి జలాభిషేకం, అమృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాభిషేకం, మహా మంగహారతి తదితర పూజలు చేశారు. 27 సంవత్సరాలుగా అమ్మవారికి పూజలు చేస్తున్నట్లు కాలనీవాసులు తెలిపారు. వాటితో పాటు వివిధ ధార్మిక కార్యక్రమాలు చేపట్టారు.

డిగ్రీలో బసవరాజుకు 9వ ర్యాంకు



బసవరాజు

కంప్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ కళాశాల విద్యార్థి బసవరాజు బీఏ డిగ్రీ పరీక్షలో 9వ ర్యాంకు సాధించి కళాశాలకు పేరు తీసుకువచ్చాడని ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ రామకృష్ణ అన్నారు. విజయనగరం శ్రీకృష్ణదేవ రాయ విశ్వవిద్యాలయ పరిధిలోని కురుగోడులో ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ కళాశాలలో 2021-2024 వార్షిక పరీక్షల్లో 84.04 శాతం మార్కులు సాధించి 9వ ర్యాంకు సాధించినందుకు కళాశాల అభివృద్ధి బోర్డు చైర్మన్, సభ్యులు, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



వైద్యుడికి వినతి పత్రం ఇస్తున్న ఖాదర్ బాషా

సిరుగుప్ప, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కేఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. బుధవారం సిరుగుప్ప పట్టణంలో కేఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో నెలకొన్న సమస్యలపై ధర్నా చేపట్టారు. అనంతరం చీఫ్ వైద్యులు వివేకానందకు వినతిపత్రం అందజేశారు. రోగులకు తాగునీరు, మందులు సక్రమంగా అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చీఫ్ వైద్యులు స్పందిస్తూ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. త్వరలో 50 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని చెప్పారు.

నేడు రక్తదాతల దినోత్సవంపై ర్యాలీ

విజయనగరం (హోస్పేట), జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక వంద పడకల ప్రభుత్వాస్పత్రి ఆవరణలో 14న ప్రపంచ రక్తదాల దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్షయ నిర్మూలనాధికారి డాక్టర్ భాస్కర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు నగరంలోని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారి కార్యాలయం నుంచి గాంధీచౌక్, షాన్‌భాగ్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, విజయనగర కళాశాల, ప్రభుత్వాస్పత్రి వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు.

ఇన్‌చార్జి ముఖ్య అధికారిగా మల్లికార్జున

కంప్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కంప్లి పురసభ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న బి మల్లికార్జునను ముఖ్య అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలను జిల్లా అధికారులు అప్పగించారు. దీంతో బుధవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం సిబ్బంది ఆయనను అభినందించారు. మల్లికార్జున మాట్లాడుతూ ముఖ్య అధికారిగా బాధ్యతలు తీసుకున్న వరకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు. తమ తోటి సిబ్బంది సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, పట్టణవాసులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జి ముఖ్య అధికారి మల్లికార్జున సన్మానిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యేలకు ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయి..?

- ఎమ్మెల్యే గణేష్ ఇంట్లో రూ.కోట్ల ఆస్తుల దస్తావేజుల స్వాధీనం
- ప్రధాన అనుచరులు, పీఏల ఫోన్లు తనిఖీ
- బళ్లారిలో ఈడీ దాడుల సంచలనం

బళ్లారి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బుధవారం దాడులు చేసింది. ఎమ్మెల్యేల ఇళ్లలో రూ.కోట్ల విలువ చేసే ఆస్తుల దస్తావేజులు, బంగారు ఆభరణాలు, భూములు కొనగోళ్ల చేసిన పత్రాలు ఈడీ స్వాధీనం చేసుకుంది. 2024 ఎంపీ ఎన్నికల్లో వాల్మీకి నిగమ మండలిలో జరిగిన అక్రమాల వ్యవహారంలో ఈడీ సోదాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేల ఇళ్లలో తీగలాడితే డొంక కదులుతోంది. కంప్లి ఎమ్మెల్యే గత ఐదేళ్లలో వెనకేసుకున్న ఆస్తులు, ఇప్పుడు ఎమ్మెల్యే అయిన తరువాత సంపాదించిన ఆస్తుల వివరాలు చూసి ఈడీ నివ్వెర పోయినట్లు సమాచారం. ఎమ్మెల్యే గణేష్ ఏకంగా 200 ఎకరాలకు పైగా ఆయకట్టు భూములు కొనుగోలు చేశారు. ఇందులో కొంత ఎమ్మెల్యే పేరుతోనూ, ఆయన భార్య పేరుతో ఉన్నాయి. మిగిలిన 150 ఎకరాలకు పైగా భూములు ఇతర పేర్లతో ఉన్నట్లు సోదాలో బహిర్గతమైంది. ఇంత భూమిని



కంప్లిలోని ఎమ్మెల్యే ఇంట్లో దాడులు చేస్తున్న ఈడీ అధికారులు



ఎమ్మెల్యే గణేష్

ఎలా కొన్నాడు అనే కోణంలో ఈడీ కూపీ లాగుతున్నట్లు సమాచారం ఎమ్మెల్యే, ఆయన భార్య జే.ఎన్ శ్రీదేవి, అప్తులు, బావమరిది పేరుతో రూ. కోట్ల విలువ చేసే ఆస్తులు సంబంధించి దస్తావేజులు ఈడీ స్వాధీనం చేసుకుంది. కంప్లిలో ఉన్న ఎమ్మెల్యే గణేష్ ఇంటిలో ఈడీ సోదాలు చేసింది. దస్తావేజుల్లో ఉన్న ప్రకారం ఈ ఆస్తులు చాలా వరకు తను ఎమ్మెల్యే అయిన తరువాతే కొనుగోలు చేశారని ఈడీ గుర్తించింది. ఇంత ఆస్తి కొనుగోలు చేసేందుకు నీకు ఎక్కడి నుంచి రాబడి వచ్చింది అని విచారించారని సమాచారం. ఉదయం నుంచి రాత్రి వరకూ వారిని ఇంటిలోనూ కూర్చోబెట్టి విచారణ చేశారని తెలిసింది. గణేష్ ఒక గదిలో ఆయన భార్య మరో గదిలో ఉంచి ఈడీ విచారణ చేస్తుంటే భార్య ఒకలాగా భర్త ఒకలా సమాధాం చెబుతున్నారని, వీరు ఇద్దరు చెప్పే మాటలు పొంతన లేకపోవడంతో ఈడీకి మరింత అనుమానం కలిగిందని తెలిసింది. ఎక్కడెక్కడ ఆస్తులు కొన్నది, ఎప్పుడు కొన్నది అవి ఎవరి పేరుతో కొన్నది అనే పూర్తి వివరాలు భార్యతో ఈడీ తెలుసుకుందని సమాచారం. గణేష్ భార్య గతంలో 5 కిలోల బంగారు కొనుగోలు చేశారు. అది ఎక్కడి నుంచి వచ్చిన ఆదాయంతో కొన్నారని ఈడీ విచారించింది. బెంగళూరు, హువ్వినఅడగలి, కురుగోడు, కంప్లి, హోస్పేట్, ఇతర ప్రాంతాల్లో ఎంత ఆస్తులు ఉండేదని పూర్తి వివరాలు రాబట్టినట్లు తెలిసింది. గణేష్ ముఖ్య అనుచరులుగా ఉన్న ముగ్గురిని కూడా ఈడీ విచారణకు రప్పించింది. వీరిలో ఇద్దరు అందుబాటులో లేమని సమధానం ఇవ్వడంతో ఒకరిని విచారించారని తెలిసింది. గణేష్ ఆయన భార్య బంధవులు, ఇతర బినామీ పేర్లతో ఉన్న ఆస్తులు అన్ని వివరాలను ఈడీ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి ముందే సేకరించిందని సమాచారం. నారా భరత్‌రెడ్డి ఇంట్లో ఈడీ ఇప్పటికే అనేక సార్లు దాడులు చేసింది. ఆయన తండ్రి నారా సూర్యనారాయణరెడ్డి పారిశ్రామికవేత్త కావడంతో ఆయన ఇంటిలో అనేక దఫాలు ఈడీ సోదాలు చేసింది. కూడ్లిగి ఎమ్మెల్యే శ్రీనివాసులు ఇతర ఆస్తులు కూడా విచారణ చేశారు. మొత్తం మీద ఈడీ సోదాలతో ఎమ్మెల్యేలు, వారి అనుచర వర్గంలో రైళ్లు పరుగెడుతున్నాయి.

ఊరూరా ఏరువాక సంబరాలు



ఎద్దుల పరుగు పొందెం పోటీలను తిలకిస్తున్న ప్రజలు

కంప్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి సందర్భంగా రెతులు ఎద్దులకు రంగులు వేసి ముస్తాబు చేసి పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఎద్దుల పోటీల్లో గెలుపొందిన రైతులకు బహుమతులు అందజేశారు. కంప్లి పట్టణంలో సీఆర్ హనుమంతు నేతృత్వంలో ఎద్దుల పరుగు పందాల పోటీలు నిర్వహించారు. రైతు మంజు ఎద్దులకు బహుమతులు అందించారు. కుడితిని పట్టణంలో కూడా ఎద్దుల పరుగు పందాల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన నాగరాజు ఎద్దులకు బహుమతులు అందించారు. ఈ సీఆర్ హనుమంతు, వి రాజశేఖర్ మాట్లాడుతూ ఖరీఫ్ పంటల సేద్యాలు ప్రారంభం కాక ముందే ఈ పండుగను ఎద్దుల పండుగగా జరుపుకుంటారన్నారు.

సిరుగుప్ప: వైభవంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. తాలుకా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో రైతులు ఎద్దులను వివిధ రంగులు, పుష్పాలతో అలంకరణ చేశారు. ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం గాంధీ సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ఎద్దుల పోటీలు నిర్వహించారు. తెలుపురంగు ఎద్దులు ఈ పోటీల్లో విజయం సాధించాయి. వేలాది మంది ఈ పోటీలను తిలకించేందుకు విచ్చేశారు.

బళ్లారిరూరల్: తాలుకాలోని మోకా, కొళగల్లు, ఎర్రగుడి, హగరి, రూపనగుడి తదితర గ్రామాల్లో ఏరువాకపౌర్ణమి సందర్భంగా ఎద్దులకు పూజలు నిర్వహించి సాయంత్రం గ్రామాల్లో ఎద్దుల అలంకరణ చేసి ఎద్దుల పందాలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయస్థాయిలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందించారు. గెలుపొందిన ఎద్దులను గ్రామాల్లో ఊరేగించారు.



బళ్లారి రూరల్: ఎడ్లబండ్లను ఊరేగిస్తున్న దృశ్యం

నకిలీ వైద్యుల క్లినిక్‌లు సీజ్

బళ్లారి సిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కొళగల్లు గ్రామంలో ఎటువంటి వైద్య డిగ్రీ లేకుండా వైద్యం చేస్తున్న ఇద్దరు నకిలీ వైద్యుల క్లినిక్‌లను సీజ్ చేసినట్లు జిల్లా ఆరోగ్య కుటుంబసంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు తెలిపారు. మేము వైద్యులమని ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆదేశాల మేరకు బళ్లారి తాలూకా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్లా నేతృత్వంలోని బృందం కురుగోడు తాలూకా కొళగల్లు గ్రామంలోని మహేశ్ క్లినిక్, మెహబూబ్ బాషా క్లినిక్‌లను సీజ్ చేశారు. వారు ఎటువంటి వైద్య డిగ్రీ పొందకపోయినా పీయూసీ(ఇంటర్) వరకు మాత్రమే చదివి వైద్యుల్లాగా నటిస్తూ మందుల గురించి సమాచారం పొందతూ ప్రజలకు చికిత్స చేస్తున్నారని కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. అధికారిక వైద్య పట్టా పొందిన వైద్యుడితో ప్రజలు తమ ఆరోగ్యాన్ని పరీక్షలు చేయించుకోవాలన్నారు. వారి నుంచి చికిత్స తీసుకోవడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు నివారించవచ్చన్నారు. గ్రామాల్లో ప్రాక్టీస్ చేస్తున్న వైద్యుడిని కనుగొని చికిత్స పొందాలన్నారు. కురుగోడు వైద్యాధికారి డాక్టర్ మంజునాథ్ జవాలి, కేపీఎంఈ విభాగం ఆరోగ్య ఇన్‌స్పెక్టర్ అరుణ్ కమార్, గోపాల్ పాల్గొన్నారు.



క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం

బళ్లారి సిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన కల్పించడానికి నిబద్ధతతో కూడిన ప్రయత్నం జరగాల్సిన అవసరం ఉందని బళ్లారి మెడికల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ గంగాధర గౌడ అన్నారు. జాతీయ శస్త్రచికిత్స వారోత్సవాల్లో భాగంగా బుధవారం బళ్లారి మెడికల్ కాలేజ్ పరిశోధనా కేంద్రం ప్రాంగణంలో కెఎ్‌సీఎఎస్‌ఐ బళ్లారి శాఖ నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటి నీరు పోసి తదుపరి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్నపర్యావరణాన్ని జాగ్రత్తగా చూసుకోఆలని పర్యావరణానికి హాని కలిగించకుండా ఉండాలని ఆయన అన్నారు. ఈసందర్భంగా బళ్లారి మెడికల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ సెంటర్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇందుమతి, సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సోమశేఖర్, ఏఎస్ఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ దివాకర్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ గరుబసవన్‌గౌడ, బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ షేఖప్ప మల్లిమణి, నగరంలోని సీనియర్ వైద్యులు డాక్టర్ సోమేశ్వర గడ్డి, డాక్టర్ అరుణ్ , డాక్టర్ అరుణ కామినేని ,డాక్టర్ అరవింద్ పాటిల్,జిల్లా శాఖ సభ్యులు, కేంద్రంలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ శస్త్ర చికిత్స వారోత్సవాల్లో వైద్యులు



గూడ్స్‌లోకి బియ్యాన్ని లోడు చేస్తున్న దృశ్యం

మేఘాలయకు సిరుగుప్ప బియ్యం

కంప్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గంగావతి రైల్వేలైన్ నిర్మాణంతో తుంగభద్ర అచ్చుకట్ట ప్రాంతంలో బియ్యానికి డిమాండ్ పెరిగింది. రాష్ట్ర సరిహద్దు దాటి మేఘాలయ వరకు విస్తరించింది. ప్రస్తుతం ఆంధ్ర నుంఇ ఒక ఏజెంట్ సిరుగుప్ప తాలుకాలోని పది రైస్ మిల్లుల నుంచి గంగా కావేరి బియ్యాన్ని మేఘాలయలోని వెస్ట్ హిల్స్‌కు రవాణా చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. అక్కడ అది మిల్లింగ్ చేస్తారు. ఈ ప్రాంతంలో బియ్యాన్ని ప్రాసెస్ చేసే వందలాది రైస్ మిల్లులు ఉన్నాయి. ఇక్కడ పండించే వరి, బియ్యానికి దేశంతోపాటు విదేశాల్లో మంచి డిమాండ్ వుంది. గంగావతి, కారటగి, సింధనూరు, సిరుగుప్ప, మాన్వి తాలుకాల్లో పండించిన బియ్యాన్ని తుమకూరు, దావణగెరె, శివమొగ్గ, బెంగళూరు, పొరుగున ఉన్న తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తుంటారు. గెనిగేర మహబూబ్ నగర్ రైల్వేలైన్‌ను గంగావతి వరకు పొడిగించడంతో బియ్యం మార్కెట్ దేశవ్యాప్తంగా విస్తరించింది. గతంలో గంగావతి రైల్వేస్టేషన్ నుంచి సిరుగుప్ప నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని మంగళవారం గంగావతి స్టేషన్‌లోని గూడ్స్ రైల్వే కోచ్‌లలోకి ఎక్కించారు. మధ్యప్రదేశ్, త్రిపుర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు బియ్యాన్ని రవాణా చేస్తున్నారు. ప్రస్తుతం సిరుగుప్ప తాలుకా నుంచి రైళ్ల ద్వారా మేఘాలయకు బియ్యాన్ని రవాణా చేస్తున్నారు. సిరుగుప్ప రైస్‌మిల్స్ నుంచి కొనుగోలు చేసిన 2,600 టన్నుల గంగాకావేరి బియ్యాన్ని జూన్ 9 ఉదయం నగరం నుంచి గూడ్స్ రైలు ద్వారా మేఘాలయకు రవాణా చేస్తారు. ట్రక్కులలోని బియ్యం రైల్వే గిడ్డంగిలో నిల్వ చేస్తారు. 25 కిలోలలో 55 బస్తాలు సిద్ధం చేసి రవాణా చేస్తారు. సిరుగుప్పలోని పది రైస్‌మిల్లుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్ ఏజెంట్ల ఆధ్వర్యంలో మేఘాలయలోని వెస్ట్ హిల్స్‌కు పంపుతున్నారని పెద్ద బసవనగౌడ తెలిపారు. రైస్‌మిల్లు యజమాని, సిరుగుప్ప 55 రైల్వే కోచ్‌లలో వేల సంఖ్యలో బియ్యం ప్యాకెట్లను లోడ్ చేయించారు. 500 మందికి పైగా కూలీలతో పోర్టర్ల సహాయంతో లోడు చేశారు.

దర్యాప్తు సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తోంది

- న్యాయవాది వెంకటేశ్ హెగ్డే



బళ్లారి సిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 11 సంవత్సరాలుగా కాంగ్రెస్, ఇతరులను ఓడించేందుకు ఐటీ, ఈడీ, సీబీఐ సంస్థలను దుర్వినియోగం చేస్తోందని కాంగ్రెస్ ప్రముఖుడు, న్యాయవాది వెంకటేశ్ హెగ్డే అన్నారు. బీజేపీ తన ప్రత్యర్థులను అవినీతిపరులుగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పటి వరకు జరిగిన దాడులన్నీ కాంగ్రెస్, ఇతర పార్టీలపైనే ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు ఈడీ ఒక్క బీజేపీ నాయకుడిపై కూడా దాడి చేయలేదన్నారు. అవినీతికి పాల్పడిన వారిని తమ పార్టీలో చేర్చుకోవడం ద్వారా వారు క్లీన్‌చిట్ ఇస్తారు. విజ్ఞానవంతులు బీజేపీని వాషింగ్‌మిషన్ అని వ్యంగ్యంగా పిలిచేంతగా వారి నియంతృత్వం సాగుతోందని విమర్శించారు. వేల కోట్ల రుపాయలు మోసం చేసి జైలుకు వెళ్లిన వారికి స్టే ఆర్డర్, బెయిల్ వస్తాయని, ఇలాంటి పరిస్థితిలో బీజేపీ మన నాయకులను కాగితపు ముక్కతో బెదిరిస్తోందన్నారు. ఇలాంటి వాటికి మా నాయకులు భయపడే ప్రసక్తేలేదన్నారు. నగర ఎమ్మెల్యేతో సహా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు నిర్దోషులుగా బయటపడతారని విశ్వసిస్తున్నామన్నారు.

మానవహక్కుల రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మమామణి



ఉపాధ్యక్షురాలు మమామణికి వినతి పత్రం ఇస్తున్న ఉరుకుందరెడ్డి

బళ్లారి రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మానవహక్కుల రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మమామణి ఎంపికయ్యారు. ఆమెకు కావలి సమితి రాజ్యాధ్యక్షులు డాక్టర్ ఉరుకుందరెడ్డి నేతృత్వంలో బుధవారం బెంగళూరు నగరం ఉడుపి రుచి హోటల్‌లో సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డాక్టర్ ఉరుకుందరెడ్డి కర్ణాటక మానవ హక్కుల కావలి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మమతామణి ఎస్ఆర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆమె సంఘాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. సంఘ సభ్యులు లీలా, రేఖ సౌమ్య, గణేష్, శకుంతల, శశిధర్, ఇంద్ర, రాజ్యలక్ష్మి, గౌరమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న లోకాయుక్త సీఐ సురేష్

సిరుగుప్ప, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాధికారులు ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని లోకాయుక్త సీఐ సురేష్ బాగేమని అన్నారు. బుధవారం సిరుగుప్ప పట్టణం శిశు అభివృద్ధి యోజన కార్యాలయంలో తాలుకా ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా లోకాయుక్త అధికారులకు అందజేశారు. ప్రధానంగా నగర పరిధిలో తాగునీరు పైపులైన్ ఏర్పాటు, రోడ్ల ఇష్టానుసారంగా తవ్వడంతో కోట్లాది రూపాయలు ప్రభుత్వ ఆస్తులకు నష్టం జరిగినట్లు ప్రజలు ఆరోపించారు. ప్రధాన రహదారిలో రోడ్ల మధ్య సీసీ రోడ్లను పగులగొట్టారు. ఏ విధమైన ప్రణాళిక లేకుండా చేయడం వల్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరిన్ని సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు అందించారు. సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని లోకాయుక్త సీఐ తెలిపారు. తహసీల్దార్ నరసప్ప, తాలుకా పంచాయతీ ఈవో పవన్‌కుమార్, వివిధ ప్రభుత్వ శాఖాధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

దయానంద్‌ను విధుల్లోకి తీసుకోవాలి

బళ్లారి రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బెంగళూరు సిటీ కమిషనర్ దయానంద్‌ను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని కర్ణాటక రక్షణ వేదిక శివరామగౌడ సంఘం అధ్యక్షుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆయన నేతృత్వంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్ మహమ్మద్ జువేరాకు వినతి పత్రం అందజేశారు. ఐపీఎల్ క్రికెట్ సంబరాల్లో జరిగిన దుర్ఘటనను సాకుగా చూపి పోలీస్ కమిషనర్‌ను సస్పెండ్ చేయడం దారుణమన్నారు. వెంటనే ఆయనను విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కర్ణాటక రక్షణ వేదిక పదాధికారులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ అధికారికి వినతి పత్రం ఇస్తున్న కర్ణాటక రక్షణ వేదిక నాయకులు

హోసూరు జోన్

తరగతి గదులు ప్రారంభం

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న ఉపముఖ్యమంత్రి ఉదయనిధి

హోసూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, నీటి సరఫరా విభాగం స్కూల్ డెవలెప్‌మెంట్ గ్రాంట్ కేపిటల్ వర్క్ కింద రూ.80లక్షల అంచనా వ్యయంతో అలసనత్తం మిడిల్ స్కూల్‌లో అదనపు తరగతి గదులు నిర్మించారు. ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. పాఠశాలలో 450 మంది తరగతులు విద్యార్థులు ఉన్నారు. తరగతి గదుల కొరత విషయమై గ్రామస్థులు కోరగా స్పందించారు. ఎట్టకేలకు నాలుగు తరగతి గదులు నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ ఆనందయ్య, మండల కమిటీ చైర్మన్ రవి, కౌన్సిలర్ సెన్నీరన్ పన్నుల కమిటీ చైర్మన్ సెన్నీరప్ప, విద్యాశాఖ అధికారులు వేద, అన్నయప్ప, రాజు, పాయస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య

ప్రత్యంగిరాదేవి ఆలయంలో విశేష హోమం

హోసూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని మహాప్రత్యంగిరాదేవి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం విశేషహోమం నిర్వహించారు. రాహుకేతువు దోష నివారణ పూజల్లోనూ పాల్గొన్నారు. స్థానికులే కాకుండా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఇక్కడ నిర్వహించే హోమానికి మిరపకాయలు వాడడం విశేషం. అయితే ఎటువంటి ఘాటు రాకపోవడం ప్రత్యేకత. మరాఠి నటి తమన్నా పనిక్కర్ పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాను ముంబై నుంచి వచ్చానని, ఇక్కడి అమ్మవారు ఎంతో శక్తివంతులు, మహిమగలవారు అని విని ప్రత్యేకపూజల్లో పాల్గొన్నట్టు తెలిపారు.



మరాఠి నటి తమన్నా పనిక్కర్

తారురోడ్డు పనులకు శ్రీకారం

హోసూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): హోసూరు నియోజకవర్గంలోని చెన్నసంద్ర గ్రామంలో జనరల్ ఫండ్ రూ.24.26 లక్షలతో రమేశ్ ఇంటి నుంచి ఆనందీశ్వర ఆలయం వరకు తారు రోడ్డు పనులు చేపట్టారు. ఎమ్మెల్యే ప్రకాశ్ భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పీడీఓ విజయ, యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి, ఉపకార్యదర్శి రమేశ్, డీఎంకే కార్యనిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్